క్లుప్తంగా

వాహనాల తనిఖీ



వాహనాన్ని తనిఖీ చేస్తున్న ఎస్సై రాములు

భీమారం: మంచిర్యాల–చెన్నూర్ జాతీయ రహదారిలో భీమారం వద్ద గురువారం ఎస్సై బి.రాములు నేతృత్వంలో పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తగా ఈ తనిఖీలు నిర్వహిస్తున్నట్లు ఎస్సై తెలిపారు. వాహన ధ్రువపత్రాలు పరిశీలించారు. ఈ మేరకు ఎస్సై మాట్లాడుతూ.. మహారాష్ట్ర నుంచి తెలంగాణ రాష్ట్రానికి సిరోంచ మీదుగా అధిక మొత్తంలో వాహనాల రాకపోకలు కొనసాగిస్తుంటాయని తెలిపారు. అనుమానిత వ్యక్తులను వాహనాల్లో ఎక్కించుకోవద్దని వాహన దారులకు సూచించారు. తనిఖీల్లో స్థానిక పోలీసులతో పాటు సీఆర్‌పీఎఫ్ పోలీసులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన



వృద్ధురాలి కంటిని పరీక్షిస్తున్న నిపుణుడు

బెల్లంపల్లి: బెల్లంపల్లి బజారు ఏరియాలో గురువారం సింగరేణి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శాంభవి ఐ విజన్ సెంటర్ ఆవరణలో నిర్వహించిన శిబిరానికి ప్రజల నుంచి స్పందన లభించింది. 60మందికి కంటి పరీక్షలు చేశారు. వీరిలో 5గురికి గుర్తించి కంటి ఆపరేషన్ కోసం హన్మకొండలోని శరత్ మ్యాక్సి విజన్ ఆపరేషన్‌కు సిఫారసు చేశారు. మరో ఏడుగురిని బెల్లంపల్లి లయన్స్ క్లబ్ కంటి ఆసుపత్రికి రెఫరల్ చేశారు. కార్యక్రమంలో కంటి పరీక్ష నిపుణుడు కొంకటి అంజయ్య, సింగరేణి లయన్స్ క్లబ్ జోనల్ చైర్‌పర్సన్ రాయమల్లు, సింగరేణి లయన్స్ క్లబ్ సెక్రెటరీ వంగల చక్రపాణి, సభ్యులు పెద్ది రాజేందర్, నల్మాస్ సంతోష్, చిప్పి అజయ్‌కుమార్, సిబ్బంది, వృద్ధులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అధికారులు

జైపూర్: మండలంలోని మిట్టపల్లి గ్రామంలో గురువారం అటవీశాఖ ఆధ్వర్యంలో ఉపాధిహామీ కూలీలకు అడవిలో జరుగుతున్న అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అడవిలో అగ్ని ప్రమాదాల వల్ల అటవీ జంతువులకు కలిగే నష్టాలను వివరించారు. అడవిలో అగ్నిప్రమాదాలు చోటు చేసుకుంటే అధికారులకు సమాచారం అందించాలని కోరారు. అడవులను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో అటవీ వన పాలకులు విజయలక్ష్మి, అటవీ రక్షకుడు రమేశ్, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో రంజాన్



శుభాకాంక్షలు చెప్పుకుంటున్న చిన్నారులు



ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్



చెన్నూర్: ప్రార్థన చేస్తున్న ముస్లింలు



నెన్నెలలో శుభాకాంక్షలు చెప్పుకుంటూ...



చెన్నూర్‌లోని గచ్చి మసీదులో...



దండేపల్లి: ఈద్గా వద్ద ప్రార్థనలు



మందమర్రిరూరల్: ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న హనుమాన్ మాలధారులు

- మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేసిన ముస్లింలు
- పండుగ ప్రాముఖ్యతను వివరించిన ఇమామ్‌లు

బెల్లంపల్లి/చెన్నూర్/భీమారం/దండేపల్లి/జన్నారం/తాండూర్/మందమర్రిరూరల్/నెన్నెల/కోటపల్లి/కాసిపేట/లక్సెట్టిపేట/జైపూర్/వేమనపల్లి: జిల్లా వ్యాప్తంగా రంజాన్ వేడుకలను గురువారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ముస్లింలు ఈద్గాకు పెద్ద ఎత్తున తరలివెళ్లి ఈద్ ఉల్ ఫీతర్ నమాజ్ ఆచరించారు. పిల్లలు, పెద్దలు, వృద్ధులు అందరూ ఈద్ నమాజ్‌లో పాల్గొన్నారు. ఇమామ్‌లు మత ప్రవచనలు చేసి, పండుగ ప్రాముఖ్యతను వివరించారు. ప్రతి ఒక్కరూ సేవా, దయాగుణం కలిగి ఉండి ఉన్నంతలో దాన ధర్మాలు చేయాలని బోధించారు. పరులకు హానీ తలపెట్టొద్దని, సన్మార్గంలో నడవాలని వివరించారు. ప్రార్థనలు ముగిశాక అనేకమంది ఆలింగనం చేసుకుని పరస్పరం ఈద్ ముబారక్ చెప్పుకున్నారు. పండుగ సందర్భంగా ఇళ్లకు వచ్చిన అతిథులకు సాంప్రదాయవంటకం రంజాన్ ప్రత్యేకం షీర్ కుర్మా(సేమియాలు) వడ్డించి ఆత్మీయత పంచుకున్నారు. అనంతరం ఖబ్రస్థాన్‌లకు వెళ్లి సమాధులను దర్శించుకున్నారు. రంజాన్ ప్రార్థనలను పురస్కరించుకుని ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. మందమర్రిలో చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి ఈద్గాల వద్దకు వెళ్లి ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. పలువురు హనుమాన్ మాలధారణ వేసుకున్న హనుమాన్ భక్తులు ముస్లింల ఇళ్లకు వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు.



బెల్లంపల్లి: నమాజ్ చేస్తున్న ముస్లింలు



కాసిపేట మండలం దేవాపూర్‌లో...



కోటపల్లి: పాల్గొన్న జెడ్పీ కో ఆప్షన్ మెంబర్ అజ్గర్



భీమారం మండల కేంద్రంలోని మసీదు వద్ద...



తాండూర్: శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు



వేమనపల్లి మండలం నీల్వాయిలో...



లక్సెట్టిపేట: ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

నీటి సమస్యలపై కంట్రోల్ నంబర్లు ఏర్పాటు

శ్రీరాంపూర్: నస్పూర్ మున్సిపాలటీ పరిధిలో ప్రజలకు తాగునీటి సమస్య పరిష్కారం కోసం ప్రత్యేక కంట్రోల్ రూం నంబర్లను ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ చిట్యాల సతీశ్ తెలిపారు. మున్సిపల్ పరిధిలోని 10, 19వ వార్డుల్లో గురువారం ఆయన పర్యటించి తాగు నీటి సమస్యలను తెలుసుకున్నారు. లీకేజీ సమస్యలను ప్రజలు వివరించగా, వాటిని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. వేసవి దృష్ట్యా ఎలాంటి తాగు నీటి ఇబ్బందులు రాకుండా ఉండటం కోసం, నీటి సరఫరాలో అంతరాయం, లీకేజీల వంటి సమస్యలు ఉంటే ఈ కంట్రోల్ రూం నంబర్లకు ఫోన్ చేయాల్సిందిగా తెలిపారు. కంట్రోల్ రూం ఇన్‌చార్జీగా డీ.మధు(అసిస్టెంట్ ఇంజనీర్, 9959283814), వాటర్ సప్లై ఇన్‌చార్జీలుగా పీ.మోహన్ (9533459712), జే.హబీబ్(9550357732), వెంకటసాయి(7799821299), ప్రశాంత్ (9553331187)లకు ఫోన్ చేసి సమస్యలను పరిష్కరించుకోవచ్చన్నారు.



నీటి సరఫరా పనులు సమీక్షిస్తున్న కమిషనర్ సతీశ్

జార్జిరెడ్డి చరిత్ర పాఠ్యపుస్తకాల్లో చేర్చాలి

- పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

మంచిర్యాలఅర్బన్: ఉస్మానియా యూనివర్సిటీ గోల్డ్‌మెడల్ గ్రహీత కామ్రెడ్ జార్జిరెడ్డి జీవిత చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌లో జార్జిరెడ్డి 52వ ర్ధంతి సందర్భంగా గురువారం జార్జిరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శాస్త్రీయమైన విద్య, సమసమాజ స్థాపనకు విద్యార్థుల హక్కుల కోసం అనేక ఉద్యమాలు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. జార్జిరెడ్డి స్ఫూర్తితో ఉద్యమాలు నిర్వహించాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు.



నివాళులర్పిస్తున్న శ్రీకాంత్, విద్యార్థులు

మజ్జిగ పంపిణీ



మజ్జిగ పంపిణీ చేస్తున్న నారీసేన సభ్యులు

మంచిర్యాలటౌన్: పట్టణంలోని హైటెక్‌సిటీ కాలనీ బస్ షెల్టర్ వద్ద వేసవిని దృష్టిలో ఉంచుకొని గురువారం నారీసేన ఆధ్వర్యంలో ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని హైటెక్‌సిటీ అసోసియేషన్ అధ్యక్షుడు సిహెచ్. హన్మంతరావు చేతుల మీదుగా ప్రారంభించారు. ఏటా చేపట్టే సేవా కార్యక్రమాల్లో భాగంగా ఈ ఏడాది కూడా మజ్జిగ పంపిణీని చేపట్టినట్లు టీమ్ చార్టర్ ప్రెసిడెంట్ శివకీర్తి తెలిపారు.

ఆలయ నిర్మాణానికి రూ.50వేల విరాళం

దండేపల్లి: మండలంలోని మాకులపేటలో నూతనంగా శివాలయం నిర్మిస్తున్నారు. ఇందుకుగాను జన్నారం మండలం రాంపూర్‌కు చెందిన నూతి చంద్రయ్య రూ.50వేలను గురువారం విరాళంగా అందించారు. ఈ సందర్భంగా అతడికి మాకులపేట గ్రామస్తులు ధన్యవాదాలు తెలిపారు.

నిర్మాణ పనుల్లో ఇష్టారాజ్యం..!



పనులకు వాడుతున్న పంచాయతీ ట్రాక్టర్



నాసిరకం ఇసుక

కన్నెపల్లి మండలంలో నిర్మించే పోలీస్‌స్టేషన్ భవన నిర్మాణానికి సంబంధిత గుత్తేదారు నాసిరకం ఇసుక వాడుతున్నారని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. మైనింగ్ అధికారులు అనుమతించిన ప్రభుత్వ రీచ్ ఇసుక వాడాల్సి ఉన్నప్పటికీ అందుకు భిన్నంగా స్థానిక వాగుల్లో దొరికే ఇసుకతోనే నిర్మాణ పనులు చేపట్టడం విమర్శలకు తావిస్తోంది. 350ఫీట్ల లోతు బోరు వేసినా నీరు పడకపోగా, నిర్మాణానికి ఒక నీటి తొట్టిని ఏర్పాటు చేసుకొని గ్రామపంచాయతీ ట్యాంకర్ ద్వారా నీటిని తెప్పించుకొని వాడుతున్నారు. అయినప్పటికీ క్యూరింగ్ సైతం సరిగ్గా చేపట్టడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. అసలే ఎండాకాలం ఆపై నీటి సమస్య ఉన్నప్పటికీ పంచాయతీ ట్రాక్టర్ అక్కడి నిర్మాణ పనులకు వాడటం ఏమిటని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పోలీసు భవన నిర్మాణ పనులు పక్కాగా చేపట్టి, పది కాలాల పాటు ఉండేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు. – భీమిని

దారికి అడ్డంగా మట్టికుప్పలు

భీమారం: మండల కేంద్రంలోని గొల్లవాగు ప్రాజెక్ట్ కింద నుంచి వెళ్లే దారిలో ఇరిగేషన్ శాఖ అధికారులు అడ్డంగా మట్టికుప్పలు వేయడంతో రాకపోకలకు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఉద్దేశపూర్వకంగానే అధికారులు రోడ్డుని మూసివేశారని రైతులు ఆరోపిస్తున్నారు. జిల్లా అధికారులు చర్యలు తీసుకొని మట్టికుప్పలు తొలగించి రాకపోకలను కొనసాగించేలా చూడాలని కోరుతున్నారు.



దారికి అడ్డంగా పోసిన మట్టికుప్పలు



భీమారంలో నివాళులర్పిస్తున్న అశోక్‌యాదవ్



జైపూర్: నివాళులర్పిస్తున్న యువకులు



కోటపల్లి: లక్ష్మీపూర్‌లో పూలే జయంతి



తాండూర్: పూలమాల వేస్తున్న సీపీఎం నాయకులు

ఘనంగా పూలే జయంతి



బెల్లంపల్లి: శ్రద్ధాంజలి ఘటిస్తున్న నాయకులు



చెన్నూర్: నివాళులర్పిస్తున్న నాయకులు

జన్నారం/మంచిర్యాలఅర్బన్/మంచిర్యాలటౌన్/భీమారం/చెన్నూర్/తాండూర్/మందమర్రిరూరల్/కోటపల్లి/జైపూర్/వేమనపల్లి/బెల్లంపల్లి/మంచిర్యాలరూరల్(హాజీపూర్): సంఘ సంస్కర్త, బహుజన పోరాట వీరుడు మహాత్మా జ్యోతిబా పూలే అందరికీ ఆదర్శ ప్రాయుడని అంబేద్కర్ సంఘం నాయకులు పేర్కొన్నారు. పూలే బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి, సంఘసంస్కర్త, సమసమాజ కృషీవలుడు అని కొనియాడారు. పూలే జయంతి సందర్భంగా బీఆర్ఎస్, కాంగ్రెస్, ఐఎఫ్‌టీయూ, ప్రజా సంఘాలు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు, బీసీ సంఘాల నాయకుల ఆధ్వర్యంలో గురువారం ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించారు. భీమారంలో తెలంగాణ రాష్ట్ర గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం అధ్యక్షుడు కొమ్ము అశోక్‌యాదవ్ ఆధ్వర్యంలో పూలే జయంతిని నిర్వహించారు. సమాజ హితం, ప్రజల్లో మార్పు తీసుకు రావడానికి జ్యోతిబా పూలే చేసిన సేవలను నాయకులు గుర్తు చేసుకున్నారు.



మంచిర్యాలఅర్బన్: టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో...



మంచిర్యాలటౌన్: వాకర్ సభ్యుల ఆధ్వర్యంలో...



సోమగూడెం మైదానంలో...



మందమర్రిరూరల్: నివాళులర్పిస్తున్న వెంకటేశ్వర్లు



జన్నారం: నివాళులర్పిస్తున్న నాయకులు



దొనబండలో పూలే జయంతి

అప్రకటిత విద్యుత్ కోతలు!

భీమారం: మండలంలోని గ్రామాల్లో అప్రకటిత విద్యుత్ కోతలతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. భీమారంలోని 33కేవీ/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి 11గ్రామపంచాయతీలకు విద్యుత్ సరఫరా అవుతోంది. అయితే కొన్ని రోజుల నుంచి రోజుకి నాలుగు గంటల వరకు అప్రకటిత విద్యుత్ కోతలు విధించడంతో పగలు, రాత్రి అనే తేడా లేకుండా ప్రజలు ఉక్కపోతకి ఇంట్లో ఉండలేని పరిస్థితి నెలకొంటుంది. మరోపక్క విద్యుత్‌తో పనిచేసే మోటార్లు, టీవీ మెకానిక్‌లు పనిచేసుకోలేక పోతున్నారు. రోజులో కనీసం నాలుగు గంటల కొద్దీ విద్యుత్ కోతలు విధిస్తుండటంతో వారు ఆర్థికంగా నష్టపోతున్నారు. అదేవిధంగా వేసవి కాలం కావడంతో కూల్‌డ్రింక్స్, జ్యూస్ సెంటర్లు నిర్వహిస్తున్న చిరువ్యాపారులు వ్యాపారం లేక కష్టాలు పడుతున్నారు. ప్రభుత్వం గృహజ్యోతి పథకం కింద గృహాలకు ఉచితంగా విద్యుత్ సరఫరా చేస్తుండటంతో తాము నిలదీయలేక పోతున్నామని వాపోతున్నారు. ఇప్పటికైనా విద్యుత్‌శాఖ అధికారులు చర్యలు తీసుకొని మండలంలో విధిస్తున్న విద్యుత్ కోతలను ఎత్తివేయాలని కోరుతున్నారు.



భీమారంలోని విద్యుత్ సబ్‌స్టేషన్